# 2 పాఠ్యాంశాల నిర్మాణ క్రమం

© SCERT not to be republished

## 1. ఉపోద్ఘాతం :

మన రాష్ట్రంలో 2012-13 నుండి నూతన పాఠ్యపుస్తకాలు తయారు చేసుకున్నాం. ఇందులో భాగంగా 2012-13 విద్యాసంవత్సరంలో 3వతరగతి పరిసరాల విజ్ఞానం పాఠ్యపుస్తకం రూపొందించడం జరిగింది. 2013-14 విద్యా సంవత్సరం నుండి 4,5 తరగతుల పరిసరాలవిజ్ఞానం పాఠ్యపుస్తకాలు 'మనం - మనపరిసరాలు' పేరుతో అమలులోకి వస్తున్నాయి. పరిసరాల గురించి, పరిసరాల ద్వారా, పరిసరాలకోసం పిల్లలు నేర్చుకోవలసి ఉంటుంది. పిల్లలు పరిసరాల గురించి అవగాహన పొందడానికి పాఠ్యపుస్తకాలు, బోధనాభ్యసన ప్రక్రియలు దోహదపడాలి. సమాచారాన్ని తరగతిగదుల్లో వినడం ద్వారా, చదవడం ద్వారా పొందడం కంటే ప్రతిచర్యలు, పరిశీలనలు, ప్రయోగాలద్వారా పొందడం ముఖ్యమైనది. ఇవి అమలులో జరిగేలా పాఠ్యపుస్తకాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఇందుకు అనుగుణంగా పుస్తకాలు, పాఠ్యాంశాలు ఉండాల్సిన అవసరముంది. నూతన పాఠ్యపుస్తకాల్లో వీటికి ఏవిధంగా అవకాశం కల్పించారో తెలుసుకోవాలి. ఇందుకోసం పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. అవగాహన చేసుకోవాలి.

- 4,5 తరగతులలోని పాఠ్యాంశాలు పరిశీలించండి.
- ఒక్కొక్క పాఠ్యాంశం ఏ అంశంతో ప్రారంభించబడింది?
- ఈ విధంగా ఎందుకు ప్రారంభించి ఉంటారు?
- ఏదైనా ఒక పాఠ్యాంశాన్ని నిశితంగా పరిశీలించండి. ఆ పాఠ్యాంశంలోని కీలక భావనలు ఏవి? వాటిని ఎలా పరిచయం చేశారు?
- ఒక పాఠంలో మొదటి నుండి చివరి వరకు ఏఏ అంశాలు / విషయాలు / భావనలు అమర్చిన క్రమం రాయండి. ఈ విధంగా ఎందుకు అమర్చి ఉంటారు?

నూతన పాఠ్యపుస్తకాలలోని పాఠ్యాంశాల క్రమం దానిలోని తాత్వికతను కింద తెలిపిన అంశాల ఆధారంగా అవగాహన చేసుకోవచ్చు.

- చిత్రాన్ని చూడండి, ఆలోచించి చెప్పండి.
- జట్లలో చర్చించండి.
- ఆలోచించండి – చెప్పండి.
- ఇలా చేయండి.
- సేకరించండి (పట్టికలు నింపండి)
- మీకు తెలుసా?
- విజయ గాధలు
- కీలక పదాలు
- మనం ఏం నేర్చుకున్నాం? లేదా మనం ఎంతవరకు నేర్చుకున్నాం?
- నేనివి చేయగలనా?

**1. చిత్రాన్ని చూడండి – ఆలోచించి చెప్పండి :**

సాధారణంగా ప్రతిపాఠం సంబంధిత చిత్రాన్ని పరిశీలించడం, సంఘటనలు లేదా సన్నివేశాన్ని విశ్లేషించడం ద్వారా ప్రారంభమైంది. ఈ చిత్రాలు, సంఘటనలు లేదా సన్నివేశాలు ఆయా పాఠాలకు ప్రారంభ కృత్యంగా ఉంటాయి.

**ఉదా :–1.** నాల్గవ తరగతిలోని "మన ఆహారం – మన ఆరోగ్యం" అను పాఠం చిత్రంతో ప్రారంభమైంది. చిత్రం ద్వారా ఆహారం, ఆహారపదార్థాలు, ఆహారం తయారీ, చేయుపనుల నుండి తినడం వరకు గల విషయాలన్నీ చర్చకు వచ్చే అవకాశముంది.

**2.** నాల్గవ తరగతిలోని "ప్రభుత్వ సంస్థలు" అను పాఠం సంఘటన, సన్నివేశంతో ప్రారంభమైంది. రంగాపురం గ్రామంలోకి వరదనీరు చేరటం, వీధులన్నీ బురదతో నిండిపోవటం, కరెంటు తీగలు పడిపోవటం.... సంఘటనతో ప్రారంభమైంది. ఈ సంఘటనపై జట్లలో చర్చింపజేయటం జరగాలి. అప్పుడే పాఠ్యవిషయంలోకి విద్యార్థులు ప్రవేశిస్తారు. పాఠంలోని విషయాలు తెలుసుకునేముందు, విద్యార్థులకు ఆ పాఠానికి సంబంధించిన పూర్వభావనలను పరిశీలించాలి. పూర్వభావనల ( Pre - Concept ) కోసం జట్లలో చర్చించి నిర్మాణాత్మకమైన ఆలోచనకు లేదా ముగింపుకు రావలసి ఉంటుంది.

ఇందుకుగాను పాఠంలో ఇచ్చిన చిత్రాన్ని విద్యార్థులచే పరిశీలింపచేయాలి. స్వేచ్ఛగా మాట్లాడించాలి. చిత్రం గురించి పిల్లలచే ఏం మాట్లాడించాలో తెలిపేందుకు చిత్రానికి సంబంధించిన ప్రశ్నలు ఇవ్వడం జరిగింది. ఆ ప్రశ్నల ఆధారంగా ఉపాధ్యాయులు మాట్లాడే ప్రక్రియను ప్రారంభించాలి. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు పిల్లలతో కలిసిపోయి పాఠంలో ఇచ్చిన ప్రశ్నలను అడుగుతూ చర్చకు అవకాశం కల్పించాలి.

అయితే పిల్లలందరి అవగాహనస్థాయి ఒకే విధంగా ఉండకపోవచ్చు. వారి అనుభవాల నేపథ్యం ఒకే రకంగా ఉంటుందని చెప్పలేము. ఫలితంగా స్పందనలలో వ్యత్యాసం ఉంటుంది. కాబట్టి చర్చ సందర్భంలో ఉపాధ్యాయులు లక్ష్యాత్మక చర్చకోసం పిల్లల స్పందనల ఆధారంగా ప్రశ్నలను మార్చుకోవాలి. సందర్భోచితంగా అనుబంధ ప్రశ్నలను అడగాలి. ఆసక్తికరమైన చర్చ సాగించాలి. చర్చలో పిల్లలందరూ పాల్గొనేలా చూడాలి. పాఠానికి సంబంధించి పూర్వ భావనలు కల్పించి, పాఠంలోకి ప్రవేశింపజేయాలి. అప్పుడే పాఠం నేర్చుకోవడానికి పిల్లలు సుముఖంగా ఉంటారు. ఇది కేవలం ఉపాధ్యాయుని చొరవ, యుక్తిపై ఆధారపడి ఉంటుందనే విషయం మరువకూడదు.

అదేవిధంగా కొన్ని సందర్భాలలో పాఠం మధ్యలో కూడా చిత్రాలు, సంఘటనలు ఇవ్వడం జరిగింది. ఇవి పాఠాన్ని సమర్థవంతంగా కొనసాగించుటకు ఉపకరిస్తాయి. విషయాన్ని విస్తృతంగా అవగాహన చేసుకొనుటకు తోడ్పడుతాయి. విద్యార్థులు సులువుగా ఉదాహరణలతో అర్థం చేసుకోగలుగుతారు.

© SCERT not to be republished

**ఉదా :- 1.** నాల్గవ తరగతిలోని "మన ఆహారం - మన ఆరోగ్యం" అను పాఠంలో మధ్యాహ్న భోజన చిత్రాన్ని పాఠం మధ్యలో ఇవ్వడం జరిగింది. చిత్రం కింద చర్చనీయాంశాలు కూడా ఇవ్వడం జరిగింది.

**2.** 5వ తరగతిలోని "జంతువులు - మన జీవన ఆధారం" అను పాఠం మధ్యలో "కరువు .....పొమ్మంది....! అను సంఘటనను ఇవ్వడం జరిగింది. ఇది విషయాన్ని వాస్తవికంగా, ఉదాహరణలతో వివరిస్తుంది. సంఘటన కింద జట్టుపనిగా చర్చనీయాంశాలు ఉన్నాయి.

ఈ విధంగా పాఠం మధ్యలోనున్న చిత్రాలు, సంఘటనలు వంటి వాటి గురించి ఉపాధ్యాయులు ఫలవంతమైన చర్చ జరిపించి అవగాహన చేయించాలి.

**ప.వి అభ్యసించడంలో చిత్రాల పాత్ర ఏమిటి? వీటి ద్వారా ఏఏ సామర్థ్యాలు / నైపుణ్యాలు పెంపొందుతాయి.**

### ✦ జట్లలో చర్చించండి :-

పాఠంలోని విషయాన్ని పిల్లలు తమ స్వంత దృక్కోణంలో, పద్ధతిలో గ్రహించడం అవసరం. నేర్చుకునే క్రమంలో, తోటి అభ్యాసకులతో చర్చించాలి. చర్చవల్ల పరస్పర సహకారం, సహాయం, సమన్వయం, సహనం, తోటివారి భావాలను గౌరవించడం, తనవంతు వచ్చే వరకు వేచివుండటం వంటి పౌరసత్వ లక్షణాలు అలవర్చుకుంటారు. అంతేకాకుండా పాఠ్య విషయాన్ని జట్లలో చర్చించడం వల్ల విద్యార్థులలో ఆలోచన పెంపొందుతుంది. తమ ఆలోచన సరైనది, కానిది తెలిసివస్తుంది. సరైనది అయితే దానిని నిర్ధారించుకొని కొనసాగిస్తారు. ఈ విధంగా స్వీయ ఆలోచన స్వీయ ఆచరణకు దారి తీస్తుంది. ఆచరణ అనుభవాన్ని ఇస్తుంది. అనుభవం, జ్ఞాన నిర్మాణానికి దారి తీస్తుంది. అనుభవ ఆధార జ్ఞానమే, వాస్తవికతను ప్రతిబింబిస్తుంది.

ఈ దృష్ట్యా పాఠాలలోని విషయ అవగాహనకు సంబంధించి బాక్స్‌లలోని ప్రశ్నలు గ్రూపు చర్చకు అవకాశం కల్పించబడింది. చర్చనీయాంశాలను ఇవ్వడం జరిగింది.

**ఉదా :- 1.** నాల్గవ తరగతిలోని "మన ఆహారం - మన ఆరోగ్యం" అను పాఠంలో "జట్టులో చర్చించండి" పేరుతో అన్నంలో ఏమార్పులు వచ్చాయి? పప్పు, కూరలు, సాంబారులో ఏ మార్పులు వచ్చాయి? ఇవ్వడం జరిగింది. పరిశీలించండి.

**2.** ఐదవ తరగతిలోని "నది జీవన విధానం" అను పాఠంలో గోదావరినది ఎక్కడ పుట్టింది, ఏయే రాష్ట్రాల గుండా ప్రవహిస్తుంది వంటి అంశాలు జట్లలో చర్చించడం కోసం ఇవ్వడం జరిగింది. ప్రతి పాఠంలో ఉన్న వీటిపై విస్తృత చర్చ జరపాలి.

ఈ చర్చ పుస్తకంలోని విషయాలను, పరిసరాలలోని విషయాలతో అనుసంధానం చేస్తుంది. సరిపోల్చుకునే అవకాశం కల్పిస్తుంది. నిజజీవిత అన్వయాన్ని తెలుపుతుంది. వాస్తవిక దృక్పథాన్ని పిల్లలకు కల్పిస్తుంది.

కాబట్టి 'జట్లలో చర్చించండి' అను అంశాలను ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో జట్టుగా చర్చింపచేయాలి. చర్చద్వారా వచ్చిన అభిప్రాయాలను నమోదు చేయించాలి.

- ✦ **ప.విలో జట్టుపనియొక్క ప్రాధాన్యత ఏమిటి? పిల్లలు జట్టు పనులు చేయునప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమిటి?**
- ✦ **జట్టుపనుల ద్వారా పిల్లలు సమర్థవంతంగా అభ్యసించడానికి ఉపాధ్యాయులుగా మీరేం చేస్తారు?**

### ✦ ఆలోచించండి - చెప్పండి :-

పాఠం మధ్యలో బాక్స్‌లలో 'ఆలోచించండి - చెప్పండి' పేరిట కృత్యాలు ఇవ్వబడినాయి. ఇవి పాఠంలోని విషయాన్ని విస్తారంగా గ్రహించుటకు ఉద్దేశించినవి. విషయాన్ని ఆకలింపు చేసుకొనుటకు ఉపకరిస్తాయి. పాఠానికి సంబంధించి విమర్శనాత్మకంగా వైవిధ్యంగా ఆలోచన చేసేవిధంగా ప్రశ్నల రూపంలో ఇవ్వడం జరిగింది. దీన్ని పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి.

© SCERT not to be republished

**ఉదా :- 1.** నాల్గవ తరగతిలోని 'మా ఊరు – మా చెరువు' అను పాఠంలో 'ఆలోచించండి' పేరుతో వర్షాలు తక్కువ కురిస్తే ఏం జరుగుతుంది? ఆలోచించి చెప్పండి అని ఇవ్వటం జరిగింది.

**2.** 5వ తరగతిలోని "అడవులు – గిరిజనులు" అను పాఠంలో

- గిరిజనులంటే ఎవరు? వాళ్ళు ఎక్కడ నివసిస్తారు?
- మీ ప్రాంతంలో ఏయే గిరిజన తెగలవాళ్ళు ఉన్నారు? వంటి అంశాలపై ఆలోచించండి – చెప్పండి పేరిట ఇవ్వడం జరిగింది.

ఉపాధ్యాయులు ఈ సందర్భంలో పిల్లలందరూ పాల్గొని ఆలోచించి చెప్పేవిధంగా ప్రోత్సహించాలి. మొదట ప్రశ్నను మొత్తం తరగతిని అడగాలి. ఆలోచించమని చెప్పాలి. ఆలోచనలను వ్యక్తిగతంగా చెప్పించాలి. చెప్పడంలో అవసరమైతే కొన్ని 'క్లూలు' లు ఇవ్వాలి. తక్కువగా స్పందించేవారిపై ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలి. తప్పుడు లేదా అసంబద్ధ స్పందనలు వస్తే నిందించకూడదు. సరియైన స్పందనలు స్వీకరించి వివరించాలి.

ఈ విధంగా చేస్తే పిల్లలలో సృజనాత్మక ఆలోచనకు అవకాశం ఏర్పడుతుంది. ఆలోచించి, వ్యక్తీకరించడం అనునది ఉన్నతమైన నైపుణ్యం. ఆలోచనలలో తమదైన క్రమాన్ని ఏర్పరచుకొని స్థాయిని పెంచుకుంటారు. కాబట్టి ఉపాధ్యాయులు ఈ కృత్యం స్వభావాన్ని, ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని బోధనాభ్యాసన ప్రక్రియలు సమర్థంగా అమలు పరచాలి.

**"ఆలోచించండి – చెప్పండి" అనే కృత్యాన్ని ఎలా నిర్వహించాలి. దీంట్లో పిల్లలందరూ భాగస్వాములు కావటానికి మనమేంచేయాలి?**

✦ **ఇలా చేయండి :**

పాఠం మధ్యలో 'ఇలా చేయండి' పేరిట కృత్యాలు ఉన్నాయి. 'చేయటం ద్వారా నేర్చుకోవడం' కోసం ఇవి ఇవ్వబడినవి. విన్నదాని కంటే చూసినది, చూసినదానికంటే చేసినది ఎక్కువకాలం స్మృతిలో ఉంటుందనేది నిర్వివాదం. చేయడం అంటే ప్రత్యక్షంగా అనుభవం గడించడంగా చెప్పవచ్చు. కార్యకారణ సంబంధాలను, ఫలితాలను స్వయంగా తెలుసుకొనే అవకాశం విద్యార్థులకు కల్పించే ప్రయత్నం జరిగింది. చిన్న, చిన్న ప్రయోగాలు, కృత్యాలను స్వంతంగా చేసి చూసి నిర్ధారణకు వచ్చే విధంగా ఇవ్వడం జరిగింది. విద్యార్థులు వీటిని సాధించడం / చేయడం ద్వారా శాస్త్రీయవైఖరులు, విలువలు పెంపొందించుకుంటారు.

**ఉదా :- 1.** 5వ తరగతిలోని 'మన శరీర భాగాలు – జ్ఞానేంద్రియాలు' అనే పాఠంలో ఇలా చేయండిలో "మీరు వినగలిగే స్థాయి ఎంత?' అనే కృత్యాన్ని ఇవ్వడం జరిగింది.

**2.** నాల్గవ తరగతిలోని 'ప్రభుత్వ సంస్థలు' అనే పాఠంలో 'మీ ఇంటిలోని రేషన్ కార్డును పరిశీలించి రాయండి' అని 'ఇలా చేయండి' లో ఇవ్వడం జరిగింది.

కాబట్టి ఉపాధ్యాయులు 'ఇలా చేయండి' పేరుతో గల ప్రతి ప్రయోగాన్ని విద్యార్థులు స్వయంగా చేసేలా బాధ్యత తీసుకోవాలి. ప్రయోగం/కృత్యం చేయడంలో విద్యార్థులకు ప్రేరణ కల్గించాలి. చేయాలనే జిజ్ఞాసను కలిగించాలి. అవసరమైతే ప్రయోగం తర్వాత చేసిన విధానం గురించి వివరించి, ఫలితం వివరించకుండా ఊహింపచేయాలి. విద్యార్థులు చేయడం ద్వారా ఫలితాన్ని నిర్ధారించుకోగలగాలి. ఈ విధంగా నిర్ధారణకు రావడంలో ఉపాధ్యాయులు సలహాదారులుగా, సహాయకులుగా ఉండాలి.

**'ఇలా చేయండి కృత్యం యొక్క ఆవశ్యకత ఏమిటి? దీనిని ఎలా నిర్వహించాలి?**

©SCERT not to be republished

✦ **సేకరించండి - నమోదుచేయండి (పట్టికలు) :**

పాఠ్య స్వభావాన్ని బట్టి పరిసరాలతో మమేకం చేయడం అవసరం. పాఠంలో కేవలం సమాచారం పొందుపరిస్తే విద్యార్థులు దానిని చదవడం, అర్థంచేసుకోవడం, జ్ఞాపకం ఉంచుకోవడం భారంగా భావిస్తారని మనందరికి తెలుసు. అందుకని పాఠాలలో వివిధ సందర్భాలలో విద్యార్థులు స్వంతంగా సంబంధిత సమాచారాన్ని సేకరించి, నమోదు చేయడం, విశ్లేషించడం కోసం పట్టికల రూపంలో 'సేకరించండి - నమోదు చేయండి' పేరిట కృత్యాలు ఇవ్వబడినవి.

పాఠ్యాంశ బోధనలో ప్రాజెక్టుపని/ క్షేత్రపర్యటన ద్వారా సమాచారాన్ని సేకరించవలసి వచ్చినపుడు పాఠం పూర్తి అగునంత వరకు నిరీక్షించకుండా ముందుగానే పిల్లలకు ప్రాజెక్టు పని అప్ప జెప్పాలి. సమాచార సేకరణ చేయించాలి. పాఠం చివరలో అభ్యాసాలు చేయిస్తున్నపుడు ప్రాజెక్టు ఫలితాలపై చర్చింపజేయాలి.

**ఉదా :- 1.** 5వ తరగతిలోని 'వాతావరణం - గాలి" అను పాఠంలో వాతావరణ వివరాలను తెలుసుకొని "వాతావరణ పట్టిక" తయారు చేయడం.

**2.** నాల్గవ తరగతిలోని "మన ఆహారం - మన ఆరోగ్యం' అనే పాఠంలో గతవారం రోజులలో పాఠశాల మధ్యాహ్న భోజనంలో వండిన ఆహార పదార్థాలు తెలుసుకొని పట్టిక రాయండి అని 'సేకరించండిలో ఇవ్వడం జరిగింది.

ఈ కృత్యాలు నిర్వహించే సందర్భంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో చర్చించాలి. వారిని సన్నద్ధులను చేయాలి. సమాచార సేకరణకు సంబంధించి స్పష్టతను ఇవ్వాలి. సమాచార సేకరణ మెళుకువలను తెలుపాలి. స్థానికంగా సంబంధిత సమాచార వనరులను గుర్తింప చేయాలి. సేకరించిన సమాచారాన్ని పట్టికలో నమోదు చేయవలసిన విధానాన్ని వివరించాలి. సరిపడునంత వ్యవధి ఇవ్వాలి. వ్యవధిలోపే మధ్య మధ్యలో తరచుగా సమాచార సేకరణ ప్రగతిని అడిగి తెలుసుకుంటుండాలి. ఈ విధంగా విద్యార్థులలో జ్ఞానార్జన కోరికను బలోపేతం చేయాలి. ఇది పాఠాలకు పరిసరాలకు మధ్యగల అంతరాన్ని తగ్గిస్తుంది. వాస్తవిక దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. విశ్లేషణా సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది.

**సేకరించండి - నమోదు చేయండి అభ్యాసాలవల్ల పిల్లల్లో ఏఏ నైపుణ్యాలు / సామర్థ్యాలు పెంపొందుతాయి? దీన్ని నిర్వహించేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు ఏమిటి?**

✦ **మీకు తెలుసా ?**

పాఠాల మధ్యలో తరచుగా (అక్కడక్కడ) 'మీకు తెలుసా' పేరుతో జ్ఞానానికి సంబంధించిన సమాచారాన్ని ఇవ్వడం జరిగింది. అవి ఆయా పాఠాలకు సంబంధించిన ఆదనపు సమాచారంగా భావించవచ్చు. తెలుసుకోవాలనే ప్రేరణను ఇవి కలిగిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన సంఘటనలను వీటిలో పొందుపరచడం జరిగింది. వ్యక్తిగతంగా ఆకర్షింపజేసి, ఆలోచనలను రేకెత్తిస్తాయి. విలువైన సమాచారం ఇందులో ఇవ్వడం వలన విద్యార్థులలో జిజ్ఞాసను / ఆసక్తిని రేకెత్తించేలాచేస్తాయి.

**ఉదా :- 1.** 5వ తరగతిలోని "పౌష్టికాహారం" అను పాఠంలో 'మీకు తెలుసా'?లో మధ్యరకం సైజులో ఉండే టమాటాలో గల ఖనిజాల గూర్చి తెలుపబడి ఉంది.

**2.** నాల్గవ తరగతిలోని 'ప్రభుత్వ సంస్థలు' అనే పాఠంలో 'మీకు తెలుసా' లో 'ఐరిష్‌కెమేరా' గురించి తెలుపడం జరిగింది. కాబట్టి ఉపాధ్యాయులు వీటిని పాఠంలోని విషయాల మాదిరిగానే గుర్తింపచేయాలి. అందులోని విషయ సమాచారాన్ని వివరించాలి, విశ్లేషింప చేయాలి. ఇంకను ఇటువంటి విషయాలను దిన, వార, పక్ష మరియు మాస పత్రికల నుండి సేకరింప చేయాలి. తరగతులలో వాటిని ప్రదర్శింపచేసి చర్చించాలి. కాని వీటిపై పిల్లలను అనవసరంగా ప్రశ్నించకూడదు.

**మీకు తెలుసా? వంటివి ఎందుకు చేర్చారు? మరికొన్ని ఇలాంటి అంశాలు సేకరించండి, తెలపండి?**

## ✦ విజయ గాథ :

పాఠ్యవిషయానికి సంబంధించిన అంశాలలో వ్యక్తులు, సంస్థలు కృషిచేసి మంచి ఫలితాలను సాధించి, గుర్తింపుపొందిన వాస్తవిక విషయాలను 'విజయగాథ' పేరిట కొన్ని పాఠాల మధ్యలో పొందుపరచడం జరిగింది. ఇవి విద్యార్థులలో భావనల అవగాహనను పెంపొందిస్తాయి. వ్యక్తిగతంగా ప్రేరణను కలిగిస్తాయి. శాస్త్రీయ దృక్పథాన్ని, అభిరుచులను విద్యార్థులలో అభివృద్ధి చేయడానికి ఇవి దోహదపడుతాయి.

**ఉదా :– 1.** 5వ తరగతిలోని 'వ్యవసాయం – పంటలు' అనే పాఠంలో 'మహిళారైతు గంగావార్ మణెమ్మ' అను విజయగాథను ఇవ్వడం జరిగింది.

**2.** నాల్గవ తరగతిలోని "ఇళ్ళు – నిర్మాణము – పారిశుద్ధ్యం' పాఠంలో "ఇంట్లో మరుగుదొడ్డి ఉంటేనే కాపురం" చేస్తానన్న అనితాబాయి విజయగాధను ఇవ్వడం జరిగింది.

ఇటువంటి విజయగాధలు స్థానికంగా ఉన్నచో వాటిని కూడా పాఠ్యబోధనా సందర్భంలో చర్చించాలి.

**విజయగాధ యొక్క ఉద్దేశం ఏమిటి? వీటిద్వారా పిల్లలు గ్రహించేది ఏమిటి? పిల్లలు వాటిలోని కీలక భావనలు గ్రహించడానికి ఉపాధ్యాయులు ఏం చేయాలి?**

## ✦ కీలక పదాలు :–

ప్రతి పాఠంలో కీలక పదాలు ఇవ్వడం జరిగింది. పాఠ్యాంశంలో ఇవి ముఖ్యమైనవిగా చెప్పవచ్చు. ఈ పదాలగురించి. తెలుసుకుంటే పాఠం అర్థం అయినట్లు భావించవచ్చు. చాలా సందర్భాలలో ఈ పదాలు తెలిసినవిగా అనిపించవచ్చు. కాని పాఠ్య విషయాధారంగా ఈ పదాలకు గల అర్థాలను / భావాన్ని గ్రహించడం అవసరం.

కాబట్టి ఉపాధ్యాయులు కీలక పదాలను పాఠంలో అంతర్భాగంగా భావించి ఒక్కొక్కదాన్ని చర్చించి విద్యార్థులకు అవగాహన కలిగించాలి. ఈ విధంగా ప్రతి పాఠంలోని కీలక పదాలను వివరించాలి. ఫలితంగా విద్యార్థులకు పరిసరాల విజ్ఞానానికి సంబంధించిన భాషా పదజాల పరిజ్ఞానం పెరుగుతుంది.

కీలక పదాలు పరిసరాల విజ్ఞానానికి చెందిన పారిభాషిక పదాలుగా చెప్పవచ్చు. కాబట్టి కీలక పదాలను బాగా అర్థం చేసుకొని, వివరించగలిగిన విద్యార్థులు పరిసరాల విజ్ఞానం పట్ల మక్కువ పెంచుకుంటారు. ఫలితంగా శాస్త్రీయదృక్పథాన్ని, సామాజిక సమర్థతను ప్రదర్శిస్తారు.

## ✦ మనం ఏం నేర్చుకున్నాం ?

ఇంతవరకు మనం అభ్యసన కృత్యాల గురించి చర్చించాము. 'మనం ఏమి నేర్చుకున్నాం?' పేరుతో ఉన్నవి అభ్యాసకృత్యాలు మరియు మూల్యాంకన కృత్యాలు. ఈ అభ్యాసకృత్యాలు కూడా అభ్యసన స్వభావం కలిగినవిగా ఉన్నవి. అభ్యసనను పునర్బలనం చేసేవిగా ఉండటం విశేషం. పాఠంలో నేర్చిన కృత్యాలు కాకుండా, వాటి ఆధారంగా అదనపు కృత్యాలు ఇందులో పొందుపరచడం జరిగింది. విద్యార్థులు పాఠాన్ని అర్థంచేసుకొని స్వంతంగా ఆలోచించి చేసేవిగా ఉన్నాయి.

అంతేకాకుండా ఇందులో ఇచ్చిన అంశాలు సాధించాల్సిన సామర్థ్యాల ఆధారంగా ఉన్నాయి. అభ్యసన మరియు అభ్యాసకృత్యాలు రెండుకూడా సామర్థ్యాల వారిగా ఉన్నాయి. కాబట్టి ఉపాధ్యాయులు "మనం ఏమి నేర్చుకున్నాం?" అను శీర్షికలోని అన్ని ప్రశ్నలను / అభ్యాసకృత్యాలను విద్యార్థులందరు చేసే విధంగా బాధ్యత వహించాలి. పాఠ్యబోధనలో ఇవి అంతర్భాగంగా భావించాలి.

©SCERT not to be republished

ఫార్మేటివ్ మరియు సమ్మేటివ్ ముల్యాంకనం చేయునపుడు పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా ప్రశ్న పత్రంలో ఇవ్వకూడదు. ఒకవేళ అవే ప్రశ్నలు ప్రశ్నాపత్రంలో ఇచ్చినట్లైతే పిల్లలు బట్టీపట్టి రాసే అవకాశముంది. పిల్లలు స్వంతంగా ఆలోచించి రాయడాన్ని ప్రోత్సహించవలసి ఉంది. కాబట్టి మూల్యాంకనం సందర్భంలో ప్రశ్నలు అడుగకుండా, ఉపాధ్యాయులు స్వంతంగా ప్రశ్నలు తయారుచేసి పెట్టాలి.

**పిల్లలు వారేమి నేర్చుకొన్నారో ఎలా తెల్సుకొంటారు? ఇందుకోసం మీరేం చేస్తారు?**

### ✦ నేనివి చేయగలనా ?

ప్రతి పాఠం చివరలో 'నేనివి చేయగలనా?' పేరిట స్వీయ మూల్యాంకన కృత్యం ఇవ్వబడింది. పాఠం పూర్తైన తర్వాత తరగతిలో ఉపాధ్యాయుల సమక్షంలో దీనిని చేయించాలి. ప్రతి విద్యార్థి వ్యక్తిగతంగా పూరించాలి. స్వంతంగా చదివి నేను చేయగలను అని భావించిన తర్వాత విద్యార్థులు '✓' గుర్తుపెట్టాలి. ఉపాధ్యాయుడు, ఏదేని అంశం విద్యార్థులు చేయగలరా? అని తెలుసు కొనదలచినపుడు, పిల్లలను చేతులెత్తమని చెప్పి ఎంతమంది చేయగలరో నమోదు చేసుకోనవచ్చును.

ఈ విధంగా తరగతిలో 80 శాతం మంది విద్యార్థులు చేయగలరు అని నిర్ధారించుకొన్న తర్వాతే తదుపరి పాఠం బోధనకు ఉపక్రమించాలి. ఒకవేళ 80 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులు చేయగలమని భావిస్తే, ఏఏ అంశాలు చేయలేమని ఎక్కువ మంది విద్యార్థులు గుర్తించారో ఆ అంశాలలో పునఃబోధన చేయాలి.

ఈ విధంగా చేయడం వల్ల విద్యార్థులు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించే అవకాశముంది. అంతకంటే ముఖ్యంగా విద్యార్థులలో మేము చేయగలం అనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. తదుపరి పాఠాలలో అందరూ చురుకుగా పాల్గొంటారు. చైతన్యవంతమైన తరగతులే పిల్లల ఆసక్తులను, అవసరాలను తీరుస్తాయి.

**ఈ అభ్యాసం యొక్క ఉద్దేశ్యం ఏమిటి? దీన్ని మీరు తరగతిలో ఎలా నిర్వహించాలి? తదుపరి చేపట్టాల్సిన చర్యలు ఏవి?**

### ✦ ముగింపు :

ఈ విధంగా నూతన పాఠ్యపుస్తకాలలో పాఠంలోని ప్రారంభకృత్యం నుండి 'నేనివి చేయగలనా?' అను చివరి కృత్యం వరకు ప్రతిదీ ప్రాముఖ్యమైనదే. ప్రతి కృత్యానికి ప్రత్యేకత ఉంది. పిల్లలను స్వీయ అభ్యాసకులుగా తయారు చేయడం అన్ని కృత్యాల అంతిమ లక్ష్యం.

పిల్లలు ఒక కృత్యాన్ని విజయవంతంగా సాధిస్తే అది మరొక కృత్య అభ్యసనకు ఆధారభూతమౌతుంది. కాబట్టి ఉపాధ్యాయులు ప్రతికృత్యాన్ని ప్రతివిద్యార్థి చేసేటట్లు ప్రోత్సహించాలి.

© SCERT not to be republished